


### *(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)*

**92**

**(4 నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ప్రఖ్యాత** హాస్య రచయితలు శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారు వారు వ్రాసిన 'భార్యను లొంగదీసుకోవడమెలా?' అనే పుస్తకం ఒకటి నాకిచ్చి "ఇది చదవండి దీనివల్ల ఉపయోగం వుంటుంది" అన్నారు ఎంతో ఆప్యాయంగా.

"నాకిది ఎందుకండీ?" అన్నాను కొంచెం ఆలోచనాపూర్వకంగా.

"ఎందుకంటారేమిటండీ! భార్యను లొంగదీసుకోవడానికి అనవసరమైన 'చిట్కా'లన్నీ వున్నాయి యిందులో. దీని వెల రూపాయిన్నరే. మీకు ఉచితం" అన్నారు నవ్వుతూ.

"ఈ పుస్తకం హెడ్డింగులో వున్న కార్యక్రమం యిదివరకే నెరవేరింది. ఇది మరెవరికన్నా ఉపయోగపడితే ఇచ్చివేస్తాను" అన్నాను.

"అలా ఏం ఇవ్వక్కర్లేదు కావాలన్న వాళ్ళు వాళ్ళే కొనుక్కుంటారు. మీరు చదవండసలు. ఎందుకు ఉపయోగపడదో చూస్తాను" అని పంపించారాయన.

సరే! నమ్రతతో వారికి నమస్కరించి పుస్తకం తెచ్చుకున్నాను. పుస్తకం మా ఆవిడ చూసింది. "మీరీ పుస్తకం తెచ్చుకున్నారు. నేను "భర్తనెలా లొంగదీసుకోవడం?" అని. శ్రీమతి పరిమళా సోమేశ్వర్ వ్రాసిన వ్యాసాలన్నీ తీసి దాచాను" అన్నదామె.

"చదివావా?" అన్నాను.

"చదవడానికి కాదు. ఏదో ఆయుధంలాగా వుంటుంది కదా అని దాచాను. యాభై వసంతాలు దాటిన వాళ్ళు దిగుళ్ళతో క్రుంగిపోవడంతో సరిపోతుంది గానీ, ఒకరిని ఒకరు లొంగదీసుకోవాలని ప్రయత్నించడమేమిటి? పాతికేళ్ళ క్రిందట అయితే వీటితో ఏమైనా ప్రయోజనం వుండేది" అన్నదామె.

"అయితే నువ్వా వ్యాసాలు చదువుకో. నేనీ పుస్తకం చదువుతాను. ప్రయోగాల విషయం ఇద్దరం ఆలోచించవద్దు" అన్నాను.

"ఆ ఆలోచనలకేం మనం ఆలోచించవలసినవి చాలా వున్నాయి. మీ మనస్సు బాగుంటే ఆషామాషీలకు సబ్జక్ట్స్ ఆలోచించుకోండి. లేకపోతే అర్ధరాత్రివేళ నిద్రలో మూలుగుతూ వుంటారు" అన్నదామె.

నేను మునిమాణిక్యంగారి గ్రంథం చదవడం ప్రారంభించాను. మొదటి వ్యాసం ప్రారంభంలోనే "మన కవులుగానీ, దేవుళ్ళుగానీ తమ తమ భార్యల్ని లొంగదీసుకోలేదు - ఎవరూ అటువంటి ప్రయత్నం చెయ్యలేదు" అని వుంది.

ఇదేమిటి ఇలా వ్రాశారు. ఇంతవరకు ఎవరూ లొంగదీసుకోకపోవడేమిటి? తెలుగు కవుల ఆత్మకథలన్నీ మాష్టారుకి తెలుసా! ఒకవేళ తెలిస్తే మాత్రం వారి గార్హస్థ్య జీవితాలు తెలుసా! తెలిస్తే మాత్రం దాంపత్యజీవన సరళులు తెలుసా! అని ఆలోచించాను.

నాలుగు పంక్తులు చదివిన తర్వాత "అది చరిత్రలో ఎప్పుడూ జరగలేదు" అని వ్రాశారు. ఏమిటి మాష్టారు ఇంత ఘంటాపథంగా చెపుతున్నారు? పోనీ ఇలాటివి వ్రాసేటప్పుడు కొందరు కవుల అభిప్రాయాలన్నా స్వీకరించారా అంటే అదీ కనిపించడంలేదు.

ఆ అధ్యాయంలో ఎక్కడో చెప్పారు "కాటూరువారు అన్నారుట వారు భార్యమాటే వింటాను. అందుకని మాకు పోట్లాటలు లేవు" అన్నారని.

కాటూరి మాష్టారు అజ్ఞాతశత్రువులాంటి వారు. ఆయనగారు ఒకరిని లొంగదీసుకోవాలనిగానీ క్రుంగదీయాలనిగానీ ఎప్పుడూ ఆలోచించి వుండరు. వారిని ఉదాహరణగా చెప్పి తక్కిన కవులందర్నీ ఆ జాబితాలో పడేస్తే ఎలా? అనిపించింది.

ఇలా ఆలోచిస్తుండగా ఒక మిత్రుడు వచ్చాడు. "ఏమిటి చదువుతున్నప్పుడు?" అన్నాడు. చెప్పను. ఆయనగారు నవ్వి "మంత్రాలతో చింతకాయలు రాలతాయా! మనిషి పుట్టుకతో రావాలిగాని" అన్నారు.

"ఎవరో సంగతి దేనికి మీ అభిప్రాయం చెప్పండి భార్యను అనుకూలవతిగా మార్చుకున్న పెద్దమనిషి ఒకడూ లేడు అని వ్రాశారు ముని మాణిక్యం వారు" అన్నాను.

"మలుచుకోడానికి అదేం మరా? తొలుచుకోవడానికి శిలా? భార్యవంక గుడ్లెర్ర చేసి చూచేవాళ్ళూ వున్నారు. కోటి దేవతల పెట్టుగా కొలుచుకునేవాళ్ళూ వున్నారు. ఎవరి యిష్టం వారిది. అసలు భార్యల్ని లొంగదీసుకొన్నవాళ్ళు లేరంటే నే ఒప్పుకోను... మా మేనత్తకు అరవై దాటినాయి. కానీ మా మేనమామ వాకిట్లో దగ్గితే వంటింట్లో రగ్గు ఒణికిపోయేది పాపం. "

"దగ్గుకే రగ్గు కప్పవలసివస్తే ఎదురుగా వచ్చి ఆయన ఒక్క కేకపెడితే ఆవిడ ఎంత వణికిపోతుందో, ఏం కప్పవలసి వస్తుందో" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏమో అదంతా నాకు తెలియదు. లొంగదీసుకున్నవాళ్ళు చరిత్రలో లేదంటే చెప్పాను" అన్నారాయన.

"ఒకళ్ళమాట దేనికి? మీ అనుభవం అభిప్రాయం చెప్పండి" అన్నాను.

"స్వంత అనుభవాలు చెప్పడం దేనికి? ప్రపంచానుభవం బోలెడుంది. దాన్ని బట్టి చెప్పవచ్చు. కొంతవరకు చెపుతా వినండి.

భార్యను లొంగదీసుకోవడం అనేది జనరల్‌గా ఆలోచించే విషయంకాదు. కోటానుకోట్ల దాంపత్యాలు అవి పూటకొకరకంగా మారుతూ వుంటాయి. గంటకోరకంగా మారేవి కూడా కొన్ని వుంటాయి.

'ప్రొద్దున్న మీరు చెప్పినట్లు విన్నాగా. ఒంటిగంటకి నాకు లొంగినట్లుగా ప్రవర్తించండి. రెండు గంటలకు మీకు లొంగినట్లు ప్రవర్తించి బాకీ తీర్చివేస్తాను' అని గడువును గంటల్లోకి, నవ్వులు వంటల్లోకి తెచ్చుకునేవారూ వుంటారు.

ఉద్యోగస్తుల విషయం మరో విధంగా వుంటుంది. అనుకోకుండానే చెరో పక్షం రోజులు ఒకరిమాట ఒకరు వినే పరిస్థితి ఏర్పడుతుంది. జీతం వస్తుంది గనుక నెలలో మొదటి పదిహేనురోజులూ భార్తకు భార్య లొంగినట్లే వుంటుంది. పదిహేనో తారీఖు నాటికి ఆయన పర్సు దులిపివేస్తాడు గనుక ఆవిడ ఆయన్ని పట్టుకు దులిపివెయ్యడం ప్రారంభిస్తుంది. పాపం ఆయన ఫస్టు తారీఖును మనసులో పెట్టుకుని ప్రాణాయామం ప్రారంభిస్తారు.

అయినా భార్యాభర్తలన్న తర్వాత ఎవళ్ళు ఎవళ్ళను లొంగదీసుకుంటారో, ఎవరు పైచెయ్యిగా వుంటారో అన్న బెంగ మనం పడటం దేనికి? కాగే పులుసులో సొరకాయముక్క ముందు వుడుకుతోందో, బీరకాయముక్క ముందా అని ఆలోచించినట్లుంటుంది. పుస్తకం మీరు చదివిన తర్వాత నాకోసారి ఇవ్వండి. ఆయన బాగా నవ్వించగలరు" అంటూ మిత్రుడు వెళ్ళిపోయారు.

Post your comments